క్లుప్తంగా

మోడల్ స్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు న్యూఢిల్లీలోని విజ్ఞాన జ్యోతి సంస్థ ద్వారా జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను బుధవారం ఉచితంగా అందించారు. చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పదిమంది చొప్పున ఇరవై మంది విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని దేశవ్యాప్త పరీక్షల్లో ప్రతిభను కనబరచాలని జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ మంగతాయారు, సంస్థ కోఆర్డినేటర్ రహమాన్ కోరారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోల రమేశ్, ఎస్ఎంసీ చైర్మన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



బ్యాగులందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట పాఠశాల విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గ్రేటర్ ఆధ్వర్యంలో లయన్ మంద జయంత్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని స్కూల్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో 320 జీ డిస్ట్రిక్ క్యాబినేట్ సెక్రటరీ లయన్ మంద వెంకటరమణారెడ్డి, జడ్‌సీ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతినిధులు వి. శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ అభిషేక్‌రెడ్డి, హెచ్‌ఎం, టీచర్లు ఉన్నారు.

హుజూరాబాద్ జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్ జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ బుధవారం జిల్లా సాధన స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హుజూరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి మాట్లాడారు. హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా వెంటనే ప్రకటించాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని, బీఎస్పీ రాజ్యాధికారం చేపడితే జిల్లాగా ప్రకటిస్తామని, బీఎస్పీ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు వేల్పుల రత్నం, చందుపట్ల జనార్ధన్, పల్కల ఈశ్వర్‌రెడ్డి, పొడిశెట్టి వెంకట్రాజం, జున్నోజు సదానందం, వేల్పుల ప్రభాకర్, సందేల వెంకన్న, శేకర్ పాల్గొన్నారు.

గన్నేరువరంలో గ్రామసభ



గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామం వరకు చేపట్టే డబుల్ రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయే బాధితులతో బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ పుల్లెల లక్ష్మీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. 42 ఫీట్లకు మించకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని తీర్మానించుకున్నారు. పాక్షికంగా, పూర్తిగా ఇళ్లు కోల్పోయే వారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పుష్పలత, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సునీల్, నాయకులు పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, బుర్ర అంజయ్యగౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచుల బంధువులకే 'గృహలక్ష్మి'

సైదాపూర్: మండలంలోని సర్పంచుల బంధువులకే గృహలక్ష్మి పథకం మంజూరైందని దరఖాస్తుదారులు బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. పదేళ్లుగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురు చూసిన నిరుపేదలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు, కొందరు ఇల్లు వస్తుందని పాత ఇళ్లు డిస్‌మెటల్ చేసుకున్నారు. రెండు రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శులకు వచ్చిన మంజూరు జాబితాలో ఆయా గ్రామాల సర్పంచులు, వారి బంధువులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఇళ్లుఉన్న వారికి, భూస్వాములకు పథకం మంజూరైందని ఆరోపించారు. ఇల్లులేని పేదలకు పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.

ప్రయాణానికి జంకుతున్నారు..!

- అడుగడుగునా రాళ్లు... నడవాలంటే కన్నీళ్లు
- అసంపూర్తిగా ఉప్పరమల్యాల–వెదిర రోడ్డు
- కంకరతేలిన రహదారిపై తరచూ ప్రమాదాలు
- వాహనదారులు, ప్రయాణికుల తంటాలు
- ప్రజలు, ఆయా పార్టీ నాయకుల ఆందోళనలు



కంకర తేలిన రోడ్డు (ఇన్‌సెట్లో) పనుల వివరాలు తెలియజేసే బోర్డు

కంకర తేలిన రోడ్డు.. పక్కనుంచి వాహనం వెళ్తుంటే భయం... టైరు కింద పడిన రాయి ఎగిరొచ్చి తాకుతుందని, తరుచూ ప్రమాదాలబారినపడుతున్న వాహనదారులు, ప్రయాణికులు సమస్య పరిష్కరించాలని రెండేళ్లుగా మొత్తుకుంటున్నా పట్టించుకోని అధికారులు. చివరికి వెసిగిపోయిన ప్రజలు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. విపక్షాల నాయకులు సంఘీభావం తెలిపినా గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామ శివారు నుంచి రంగరావుపల్లి, హిమ్మతనగర్ గ్రామాల నుంచి రామడుగు మండలం వెదిర గ్రామం వరకు నిర్మిస్తున్న ప్రధాన రహదారి పనులు పూర్తి కావడం లేదు.

గంగాధర: మండలంలోని కురిక్యాల–గర్శకుర్తి ప్రధాన రహదారిలో ఉప్పరమల్యాల గ్రామ శివారు నుంచి హిమ్మత్‌నగర్ గ్రామం ద్వారా రామడుగు మండలం వెదిర గ్రామంలోని కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి వరకు 6.65 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా రూ. 3.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

➡ రోడ్డు పనులకు 2021లో టెండర్లు నిర్వహించారు. కాంట్రాక్టర్ 2021 జులై 28న అగ్రిమెంటు చేసుకొని పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా పనులు పూర్తి కావడం లేదు.

➡ రామడుగు మండలం వెదిర, గంగాధర మండలం హిమ్మత్‌నగర్ గ్రామాల పరిధిలో సీసీరోడ్లు, మురుగుకాలువ పనులు పూర్తయ్యాయి. మిగిలిన రోడ్డుపై తారు వేయడానికి దొడ్డు, సన్నపు కంకర పోసి రోలింగ్ చేసి వదిలేశారు. ఏడాదిగా కంకర రోడ్డుపై వాహనాల రాకపోకలతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

➡ కంకర రోడ్డుపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడుకార్లు అదుపు తప్పి బోల్తా కొట్టిన సంఘటనలు ఉన్నాయి.

➡ రోడ్డుపై తేలిన కంకరను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

➡ రోడ్డు వెంట పంట పొలాలకు వెళ్లే రైతులు కంకర రోడ్డుపై నడవడానికి తంటాలు పడుతున్నారు. నడుచుకుంటూ వెళ్లే సమయంలో వాహనాలు వెళ్లే సమయంలో రాళ్లు వచ్చి తగులుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

➡ వెదిర, హిమ్మత్‌నగర్ గ్రామస్తులు కంకర తేలడంతో వాకింగ్ బంద్ చేశారు.

➡ తారురోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలని వెదిర,హిమ్మత్‌నగర్, రంగరావుపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

➡ అసంపూర్తి ఉప్పరమల్యాల–వెదిర బీటీ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని హిమ్మత్‌నగర్, రంగరావుపల్లి గ్రామాల ప్రజలు ఇటీవల కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి వెదిర గ్రామంలో ఆందోళనకు దిగారు.

➡ గ్రామస్తుల ఆందోళనకు బీజేపీ, బీఎస్పీ నాయకులు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఆరోపించారు. వెంటనే పనులు ప్రారంభించక పోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

➡ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనదారులకు ప్రయాణం సౌకర్యంగా ఉంటుంది.

➡ కరీంనగర్ నుంచి వెదిర, హిమ్మత్‌నగర్, గట్టుభూత్కూర్, ఆచంపల్లి ద్వార గర్శకుర్తి వరకు అక్కడి నుండి తాడిజర్రి, రంగరావుపల్లి, ఉప్పరమల్యాల ద్వార కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిలోని కురిక్యాలకు చేరుకోవచ్చు. అక్కడి నుంచి గంగాధరకు తిరిగి జిల్లా కేంద్రానికి చేరుకునే అవకాశం ఉంటుంది.

పనులు పూర్తి చేయాలి



అసంపూర్తి పనులు పూర్తి చేయాలి. రైతులు పంటపొలాల వద్దకు, వాహనదారులు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. పనులు పూర్తయితే జిల్లా కేంద్రానికి వెళ్లడానికి రంగరావుపల్లి, తాడిజర్రి, ఉప్పరమల్యాల, హిమ్మత్‌నగర్ గ్రామాల ప్రజలకు దూరం తగ్గుతుంది.

– ద్యావ భాస్కర్‌రెడ్డి, రంగరావుపల్లి

భయమేస్తోంది



వెదిర గ్రామ శివారు నుంచి హిమ్మత్‌నగర్ గ్రామం వరకు రోడ్డుపై కంకర తేలడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే మూడు కార్లు అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లాయి. సైకిల్‌పై వెదిరకు వెళ్లంటే రెండుసార్లు పడిపోయాను. రోడ్డుపై పంటపొలాలకు వెళ్లాలంటేనే భయమేస్తోంది.

– రాజు, హిమ్మత్‌నగర్

సీపీఐ బొమ్మనపల్లి గ్రామ కార్యదర్శిగా సంపత్



మామిడి సంపత్

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామశాఖ సీపీఐ కార్యదర్శిగా మామిడి సంపత్ ఎన్నికయ్యారని పార్టీ మండలశాఖ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నామని చెప్పారు. సహాయ కార్యదర్శిగా అందె సంపత్ ఎన్నికయ్యారని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందెస్వామి, మండల సహాయకార్యదర్శి అందె చిన్నస్వామి, యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు చట్ల సమ్మయ్య, రైతు సంఘం అధ్యక్షుడు మామిడి రాజు, సీనియర్ నాయకులు బండారి తిరుపతి, కుందేళ్ల మల్లయ్య, వెంకన్న, నరేశ్, అనిల్, అంజి, సంపత్ పాల్గొన్నారు.

ఒద్యారం గ్రామాన్ని కొత్తపల్లి మండలంలో కలపాలి

గంగాధర: మండలంలోని ఒద్యారం గ్రామాన్ని గంగాధర మండలం నుండి తప్పించి కొత్తపల్లి మండలంలో చేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 5 నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఒద్యారం గ్రామ మండల మార్పు కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. కమిటీ ముఖ్య సలహాదారులుగా పారువెళ్ల హన్మంతరావు, కమిటీ కన్వీనర్‌గా ములుకుంట్ల సంపత్, చైర్మన్‌గా బాలసంకుల అనంతరావు, సలహాదారులుగా కూనబోయిన సత్తయ్య, రాచకొండ మనోహర్ రావును సభ్యులుగా ఎన్నుకొని కార్యక్రమాల రూపకల్పన చేశామని తెలిపారు. ఈసందర్భంగా కమిటీ చైర్మన్ అనంతరావు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు గంగాధర మండలానికి వెళ్లాలంటే దాదాపు యాభై కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తోందని, గంగాధర మండలం నుంచి ఒద్యారం గ్రామాన్ని తొలగించి కొత్తపల్లి మండలంలో కలిపే విధంగా కృషి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



కాట్రపల్లి జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

ఇల్లందకుంట: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ. 20 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పావని వెంకటేశ్, సర్పంచ్ శ్రీలత సురేందర్‌రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, మోటపోతుల ఐలయ్య ,తిరుపతి, సింగిల్‌విడో వైస్ చైర్మన్‌కందాల కొంరెల్లి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సర్పంచ్ కాసగోని నిరోషాకిరణ్ అధ్యక్షతన కౌశిక్‌రెడ్డి ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధిలో పరుగులు తీస్తున్నాయని, రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ కనుమల్ల విజయ, డీపీవో వీర బుచ్చయ్య, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ రాణి, ఎంపీటీసీ రావుల, పంచాయతీరాజ్ శాఖ డీఈ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో జయశ్రీ, ఎంఈవో కె.నర్సింహారెడ్డి, సామాజిక కార్యకర్త వర్దినేని రవీంద్రరావు, ఎంపీవో సురేందర్, వివిధ గ్రామాల కార్యదర్శులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లతో ఆత్మీయ సమ్మేళనం



ఎమ్మెల్యేకు దట్టీ కడుతున్న ఆటో డ్రైవర్లు

గంగాధర: మండల కేంద్రంలో బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆటో డ్రైవర్లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి దాదాపు వెయ్యి ఆటోలతో మధురానగర్ నుంచి భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు హెల్త్ బీమా కార్డులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో రెండోసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నానని, మధురానగర్ చౌరస్తాలో మరుగుదొడ్డి నిర్మిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. ఆటో కార్మికులు ఎమ్మెల్యేకు పూర్తి స్థాయిలో మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు పత్రం అందజేత

రామడుగు: మండలంలోని షానగర్ గ్రామం మున్నూరుకాపు సంఘం భవనానికి రూ. 4.50 లక్షల నిధుల మంజూరు పత్రాన్ని బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంఘం ప్రతినిధులకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుతూ నిరసన



బతుకమ్మ ఆడుతున్న కార్మికులు

శంకరపట్నం: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ప్రభుత్వం తక్షణమే డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. 15 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయకార్యదర్శి సమ్మయ్య, రజిత, పద్మ, హలీమ, తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

గంగాధర: మండలంలోని నాగిరెడ్డిపూర్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం గడపగడపకూ కాంగ్రెస్ నిర్వహించారు. అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని, కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మనోహర్, రామిడి రాజిరెడ్డి, బూర్గు గంగన్న, చక్రపాణి, సత్యనారాయణ, రాచమల్ల భాస్కర్, ముచ్చ శంకరయ్య, బండారి నర్సయ్య, యగ్నేశ్, అజయ్, రంజిత్, కూమరస్వామి, మహేశ్, తోట కరుణాకర్, నాగేందర్, మహేందర్, షాదుల్లా పాల్గొన్నారు.

మానకొండూర్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త కృషిచేయాలని ఏఐసీసీ పరిశీలకులు, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జి క్రిస్టోఫర్‌తిలక్ అన్నారు. బుధవారం మండలంలోని ముంజంపల్లిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మండల స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. గడపగడపకూ ఆరు గ్యారంటీ పథకాలను వివరించాలన్నారు.

కొలువులు సాధించారు..



తడిగొప్పుల సోని

మానకొండూర్: గ్రామీణ యువకులు పలువురు కానిస్టేబుల్ కొలువు సాధించారు. మానకొండూర్‌కు చెందిన బోయిని లత, మద్దికుంటకు చెందిన కూకట్ల సుమలత సివిల్ కానిస్టేబుళ్లుగా, గంగిపల్లి గ్రామానికి చెందిన రెడ్డపాక ఆంజనేయులు జైలు వార్డెన్‌గా కొలువు సాధించగా, టీఎస్‌పీఎస్సీ కానిస్టేబుల్‌గా ఇదే గ్రామానికి చెందిన లోకిని శేఖర్, బొంపెల్లి సుదర్శన్ ఏఆర్ కానిస్టేబుల్‌గా కొలువు సాధించారు. అన్నారంకు చెందిన రామగిరి ఈశ్వర్, అట్ల గణేష్, పుట్ట గణేశ్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

వీణవంక: మండలంలోని మామిడాలపల్లికి చెందిన యశ్వాడ చంద్రప్రకాశ్, గుంపుల గౌతమ్, శ్రీధర్‌రెడ్డి, బేతిగల్ గ్రామానికి చెందిన తడిగొప్పుల సోని, గుజ్జుల జ్యోతి కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. సోని మొదటి ప్రయత్నంలోనే కొలువు సాధించడంతో గ్రామస్తులు అభినందించారు.

▲ ఓటరు నమోదుపై సమావేశం

జమ్మికుంట: రాబోయే ఎన్నికల కోసం పరిపూర్ణమైన ఓటరు లిస్ట్ తయారు చేయాలని తహసీల్దార్ రజని సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహిచారు. నూతన ఓటర్ల నమోదు, ఓటరు లిస్టులో తప్పుల సవరణ, వీఐపీ తాజా, మాజీ ప్రజాప్రతినిధుల ఓట్లు ఉన్నాయా లేదా చూసుకోవాలన్నారు. పూర్తి స్థాయి ఓటరు లిస్టను గ్రామ పంచాయతీ బోర్డుపై అంటించాలని బీఎల్‌వోలకు ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, ఆర్ఐలు తిరుపతి, సంతోష్‌కుమార్, ఏఎస్‌వో హైమ, కార్యాలయం సిబ్బంది పర్వేజ్, రాజేందర్, స్వామి, కాజిమ్, రాజు, రమేశ్, నవీన్, సబితా పాల్గొన్నారు.

▲ గాడితప్పిన అంగన్‌వాడీల నిర్వహణ

సైదాపూర్: బంగారు తెలంగాణలో అంగన్‌వాడీల నిర్వహణ గాడితప్పిందని, కాలం చెల్లిన ఆహార పదార్థాలను ప్రభుత్వం కేంద్రాలకు సరఫరా చేస్తోందని బీఎస్పీ మండల అధ్యక్షుడు జేరిపోతుల రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని బొమ్మకల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం నాయకులతో కలిసి సందర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పౌష్టికాహారం అందిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రచారం చేసుకుంటున్నారని, నాసిరకం బియ్యం, కాలం చెల్లిన కోడిగుడ్లు పిల్లలు, బాలింతలకు సరఫరా చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక విద్యలో విలీనం చేసే హామీ కార్యరూపం దాల్చలేదన్నారు.

▲ పంపిణీకి చీరలు సిద్ధం

ఇల్లందకుంట: మండలంలోని 18 గ్రామాల మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ సిద్ధంగా ఉన్నాయని తహసీల్దార్ రాణి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు పదివేల ఏడువందల అరవై ఐదు చీరలు వచ్చాయని త్వరలో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

▲ సఖీ కేంద్రానికి మహిళ తరలింపు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట బస్టాండ్‌లో కొద్దిరోజులుగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న అనాథ మహిళను బుధవారం జిల్లా సఖి కేంద్రానికి తరలించారు. సర్పంచ్ కర్ర సత్యప్రసన్న విషయాన్ని అధికారులకు తెలియజేశారు.

▲ ఆర్థిక సాయం

చొప్పదండి: పట్టణానికి చెందిన ఐతరవేణి గట్టయ్య రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లడంతో ఆయన కుటుంబానికి పట్టణానికి చెందిన యంగ్‌బాయ్స్ యూత్‌క్లబ్ సభ్యులు బుధవారం ఆర్థికసాయం చేశారు. గట్టయ్య పిల్లలకు యూత్ క్లబ్ అధ్యక్షుడు జహీరుద్దీన్ ఆధ్వర్యంలో రూ. 8,500 అందించారు. దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంజీవ్, విశ్వమోహన్, చందన్ కుమార్, ఖా జా అలీ, జిట్ట కుమార్, ప్రవీణ్, శేఖర్, శ్యామ్, లక్ష్మణ్, శేఖర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

▲ బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ శివారులో బైక్ అదుపుతప్పి గుంతలో పడటంతో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... అంబాల్‌పూర్‌కు చెందిన పెద్దాపురం అరుణ్ కుమార్ మంగళవారం అర్ధరాత్రి బైక్‌పై వెళ్తుండగా తాడికల్ శివారులో రోడ్డు పనుల నిమిత్తం చేపడుతున్న గుంతలో పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించామన్నారు.

▲ ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట: భూ వివాదంలో ఇద్దరిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రమేశ్ బుధవారం తెలిపారు. రామన్నపల్లికి చెందిన బోగ రామలింగం, చంద్రమౌళి అన్నదమ్ములు, రామలింగం కొడుకులు స్వామి, రవీందర్ రూ.40 వేలు తీసుకొని చంద్రమౌళికి భూమి ఇవ్వడానికి ఒప్పందం చేసుకున్నారు. భూ రిజిస్ట్రేషన్ అడిగే క్రమంలో స్వామి, రవీందర్ చంపుతామని బెదిరించగా బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అభివృద్ధికి మానకొండూరు ఆదర్శం

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



పెరిక సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిమ్మాపూర్: రాష్ట్రంలో అభివృద్ధికి ఆదర్శంగా మానకొండూరు నియోజకవర్గం నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్ అన్నారు. బుధవారం మండలంలోని మహాత్మానగర్, తిమ్మాపూర్, పోరండ్ల, మల్లాపూర్, గొల్లపల్లి, రామకృష్ణకాలనీ గ్రామాల్లో వివిధ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. మల్లాపూర్‌లో నూతన జీపీ, తిమ్మాపూర్‌లో పెరిక సంఘం భవనాలను ప్రారంభించారు. పోరండ్లలో సొసైటీ గోదాంలు సొసైటీ బ్యాంకును కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు తో కలిసి ప్రారంభించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో పాటు బతుకమ్మ, కోలాటం, డప్పు చప్పుళ్లు, పూల వర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. మేమంతా మీవెంటే అంటూ రసమయికి సంపూర్ణ మద్దతు పలికారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి కానుకగా ఇస్తామని ప్రజలు హామీ ఇచ్చారు. 2024 లో రసమయి మంత్రిగా మానకొండూరులో పర్యటించాలన్నారు. నియోజవర్గ ప్రజలు మళ్లీ ఆశీర్వదిస్తే రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులను ప్రజలు తరిమి కొట్టే రోజులు దగ్గర పడ్డాయని, పార్టీకి నాయకులు, కార్యకర్తలు కరువయ్యారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత, పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఇనుకొండ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

జమ్మికుంట: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులతో ర్యాలీ, ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఐదేళ్లుగా బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్ పెంచాలని డిమాండ్ చేశారు. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్కాలరిషిప్ రాకపోవడంతో కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తోందని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో అనేక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, లేదంటే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పల్నాటి అభిలాశ్, పర్వీన్, అస్మత్, అఖిల్, సమీర్, హుజూరాబాద్ నియోజకవర్గ నాయకులు హనుమంత్ ప్రసాద్, అన్వేశ్, అవినాశ్, అరుణ్, అరవింద్, వంశీ , శివగణేశ్, హర్ష అజయ్, రాకేశ్, పవన్, సందీప్ పాల్గొన్నారు.

ఎమ్.ఎస్ స్వామినాథన్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

జమ్మికుంట: హరిత విప్లవం పితామహుడు ఎం.ఎస్ స్వామినాథన్ ఆలోచనలను ప్రభుత్వాలు అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వ్యవసాయరంగంలో శాస్త్రీయ ఆలోచనలతో హరిత విప్లవం సృష్టించారని కొనియాడారు. ఆధునిక పద్ధతులు, సేద్యంలో మెళుకువలు, తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి, శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారని, ఆయన పరిశోధనలు రైతాంగానికి ఎంతో దోహదపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శీలం అశోక్, నాయకులు సంపత్‌రావు, శంకర్, లింగారెడ్డి, సదానందం, శ్రీకాంత్, రావుల ఓదెలు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.